క్లుప్తంగా

పలాస ఆర్డీవోగా కృష్ణమూర్తి



పలాస: పలాస ఆర్డీవోగా ఎం.కృష్ణమూర్తి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఆర్డీవోగా విధుల్లోకి చేరిన సుదర్శన దొరకు ఆకస్మికంగా బుధవారం గుండెపోటు రావడంతో ప్రస్తుతం అతను సెలవులో ఉన్నారు. దీంతో అతని స్థానంలో టెక్కలి ఆర్డీవోగా ఉన్న కృష్ణమూర్తి ఎఫ్ఏసీగా విధుల్లో చేరారు. అతనికి స్థానిక రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు సత్కరించారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

కంచిలి: మండలంలోని కంచిలి బీసీ బాలుర వసతి గృహం, జాడుపూడి గ్రామంలోని కేజీబీవీ హాస్టల్స్‌ను సోంపేట ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. అందరికీ న్యూట్రిషన్ ఆహారం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి బీసీ బాలుర వసతి గృహాన్ని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత గురువారం సందర్శించారు. విద్యార్థుల వసతి, ఆహారం, వైద్య, విద్య వంటి అంశాలను తనిఖీ చేశారు. దోమల నుంచి రక్షణకు కిటికీలకు మెష్‌లు ఉంచాలన్నారు.

జాబ్‌మేళాలో 67 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 67 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముత్తూట్ మైక్రోఫిన్, ఎస్‌బీఐ టీమ్‌లీజ్, అరబిందో తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు 159 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 67 మంది ఎంపికయ్యారన్నారు.

సమస్యలపై వినతి



ఎమ్మెల్సీ రఘువర్మకు వినతి అందిస్తున్న పీడీలు

కాశీబుగ్గ: మందస మండలంలోని మందస, చీపి, కిల్లోయి, బుడంబో, చినకోష్ట, పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పి.రఘువర్మ గురువారం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీలు) తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్నటువంటి వెండర్స్, దుకాణదారులు, ప్రయాణికులకు బాల్య వివాహాలపై పలాస లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్ నేతృత్వంలో చైల్డ్ హెల్ప్ డెస్క్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

కంచిలి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న లిమ్మేశ్వరి అమ్మవారి ఆలయానికి అవసరమైన వంట సామగ్రిని భక్తులు ఏర్పాటు చేశారు. రెండు గ్యాస్ సిలిండర్లు, రెండు గ్యాస్ స్టవ్‌లు, ఆరు కుర్చీలను ఆలయ నిర్వాహకులకు గురువారం అందజేశారు. ఈ ఆలయంలో దసరా నవరాత్రులు సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తుల నుంచి వచ్చిన విరాళాల్లో మిగిలిన డబ్బులతో వీటిని కొనుగోలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

వింత జంతువు అలజడి

కాశీబుగ్గ: పలాస మండలంలో ఉన్న నీలావతి పంచాయతీ పరిధి చిన్న నీలావతి గ్రామ రెవెన్యూ పరిధిలో వింతజీవి అరుపులతో హల్‌చల్ చేసింది. సమీప ప్రాంతంలో తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేసింది. అనంతరం బావిలో పడిపోయింది. దీంతో స్థానికులు భయపడుతున్నారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు, సిబ్బంది ఆ వింత జీవిని బయటకు తీసుకురావాలని కోరుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామంలో దేవాలయాలు, రోడ్డు పక్కన మొక్కలు నాటే కార్యక్రమం గురువారం చేపట్టారు. సర్పంచ్ గేదెల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల సూర్యనారాయణ, భీష్మ తదితరులు పాల్గొన్నారు.



'భౌ'బోయ్

వజ్రపుకొత్తూరు మండలంలో గ్రామ సింహాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పగలు, రాత్రి అని తేడా లేకుండా వీధుల్లో సంచరిస్తున్నాయి. రహదారులపై ఉంటూ అటుగా వెళ్లే వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. అలాగే ఆరుబయట ఆడుకునే చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను గాయపరుస్తున్నాయి. దీంతో అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఇక్కట్లు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి చిన్న బజారు సమీపంలోని రామదాసుపేట వీధి జంక్షన్ వద్ద పలకలు తొలగించిన మురుగు కాలువ వద్ద ఇంకెన్నాళ్లు ఇక్కట్లు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలువ మరమ్మతుల కోసం ఇటీవల పలకలను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా పలకలు వేయాల్సి ఉండగా, నెలల తరబడి తాత్సారం చేయడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

–టెక్కలి





చినుకు పడితే చెరువే

బోరుభద్ర నుంచి మేఘవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కొల్లిపాడు వద్ద చినుకుపడితే చెరువుగా మారుతోంది. ఇటీవల వర్షాలకు చెరువు నీరు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో తారు మొత్తం కొట్టుకుపోయి రాళ్లుతేరి పెద్దపెద్ద గోతులుగా తాయారైంది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– సంతబొమ్మాళి

వదిలేశారు

పలాస మండలం రెంటికోట మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి నీటి కాలువ పరిస్థితి ఇది. వర్షాధారంగా వచ్చే గెడ్డ నీటిని గ్రామంలో కోనేరుకు తరలించాలనే ఉద్దేశంతో బీటీ రోడ్డు పక్కన తవ్వారు. అయితే అనంతరం పంచాయతీలో నిధులు లేవని తవ్విన కాలువలు విడిచిపెట్టేశారు. దీంతో వాహనదారులు, పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పంచాయతీ నిధులతో పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– కాశీబుగ్గ





శిథిలావస్థ

ఇచ్ఛాపురం పట్టణంలోని బెల్లుపడ గ్రామం వద్ద పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ భయంతోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పశు వైద్యశాల పైకప్పు అప్పుడప్పుడూ పెచ్చులూడి కింద పడుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొత్త భవనాలను నిర్మించాలని కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం..!



- అందుబాటులో ఉండని వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

ఇచ్ఛాపురం రూరల్:

పాతిక గ్రామాల కలలను సాకారం చేస్తూ రూ.1.85 లక్షల వ్యయంతో నిర్మించిన ఈదుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం చేసింది. మత్స్యకార గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2024 ఫిబ్రవరిలో ఈ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రోగుల తాకిడి దృష్ట్యా ఈ ఆస్పత్రికి ప్రభుత్వం ఇద్దరు వైద్యులతో పాటు సిబ్బందిని నియమించింది. అయితే అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఈ ఆస్పత్రిలో వైద్యులు ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు ఉండరో తెలియక రోగులు తికమక పడుతూ ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించాల్సిన ఒక వైద్యాధికారి ఇచ్ఛాపురంలో తన సొంత ఆస్పత్రికే పరిమితమవుతున్నారు. ఏ సమయంలో ఆస్పత్రికి వస్తారో సిబ్బందికే తెలియకుండా పోతోంది. తన సొంత ఆస్పత్రిలోనే అధిక సమయం రోగులకు వైద్యం చేస్తూ ఉంటుంటారన్నది బహిరంగ రహస్యం. తనకు అధికార పార్టీ అండదండలు ఉండడంతో సిబ్బంది సైతం ఆయన ముందు నోరు మెదిపేందుకు జంకుతుంటారు. ఈయన ఈ ఆస్పత్రికి డీడీవోగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా మరొక వైద్యురాలు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌కు అప్పుడప్పుడూ వెళ్తుండడం మూలంగా, అక్కడ సిబ్బందే వైద్యుల అవతారం ఎత్తుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వైద్యమందించే వైద్యులను నియమించాలని రోగులు కోరుతున్నారు.



ఈదుపురం ఆస్పత్రి (ఇన్‌సెట్లో) ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి చైర్



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిబ్బందే మాకు దిక్కు



మొదట్లో ఈ ఆస్పత్రికి అధికంగా రోగులు వచ్చేవారు. అయితే వైద్యులు సరిగ్గా ఉండరన్న ఉద్దేశంతో ఇప్పుడు ఇక్కడికి వచ్చే రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈ ఆస్పత్రిలో అప్పుడప్పుడు ఒకే ఒక్క వైద్యురాలు కనిపిస్తుంటారు. ఆమె సైతం ఈరోజు రాలేదు. వైద్యులు రోజూ వస్తే మాకు భరోసా ఉంటోంది. వైద్యులు లేని సమయంలో సిబ్బందే మాకు దిక్కు అవుతుంటారు.

– బుడత కేశవరావు, చిన్న బూర్జపాడు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సోంపేట: మండలంలో కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి, గొల్లూరు, టి.శాసనాం, సిరిమామిడి, ఉప్పలాం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇచ్ఛాపురం రూరల్: విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని డొంకూరు, బూర్జపాడు, సన్యాసిపుట్టుగ, కేదారిపురం, ఏఎస్‌పేట, పురుషోత్తపురం, ముచ్చింద్ర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు. ఈదుపురం, పురుషోత్తపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల పనులు చేపడుతున్నామని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని వజ్రపుకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ బెండి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల పనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జి.యోగేశ్వరరావు తెలిపారు. బెండి, నగరంపల్లి, మంచినీళ్లపేట, పెద్దబొడ్డపాడు, హుకుంపేట, కొండపూరు, సీతాపురం, పెదబాడాం తదితర గ్రామాల్లో కలగనున్న ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

ఉత్తమ విలన్‌గా కుమార్ నాయక్

కాశీబుగ్గ:

అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఒడియా చిత్ర ఉత్తమ విలన్ అవార్డును పలాసకు చెందిన నటుడు డాక్టర్ కుమార్ నాయక్ అందుకున్నారు. ఈ కార్యక్రమం భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఎవడి సినిమాకి వాడే హీరో సినిమాలో ప్రతి నాయకుడి పాత్రలో ప్రతిభ కనబర్చినందుకు ఆ అవార్డు అందించారు. కార్యక్రమంలో కంచలంక ఫిలిం ఛానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిత్తరంజన్ నాయక్, ఒడియా ఫిలిం డైరెక్టర్ సుధాకర్ బసంత్, ఒడియా ఫిలిం యాక్టర్ అండ్ యాంకర్ గుడిపాత్ర, ఐఎఫ్ఎంఏ ఇంటర్నేషనల్ చైర్మన్ హెచ్‌ఆర్ దిలీప్, జాతీయ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఒడియా, తెలుగు, కన్నడ, హిందీ, తమిళ్, భాషల అగ్ర నటీనటులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కుమార్ నాయక్

అంగన్‌వాడీకి భవనం కేటాయించాలి

సోంపేట: పట్టణంలోని పెద్ద కోమటి వీధి అంగన్‌వాడీ–1 కేంద్రానికి భవనం కేటాయించాలని జైభీమ్ సేన ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఉప తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం గత కొద్ది సంవత్సరాలుగా పెద్దకోమటి వీధి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించడం జరిగేదన్నారు. అయితే ప్రస్తుతం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ వద్దు అనడంతో వసతి సమస్య ఎదురయ్యిందన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుష్క ఈశ్వరరావు, వ్యవస్థాపకులు నగిరి మోహనరావు, సభ్యులు బసవ శ్రీను తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జైభీమ్ సేన ప్రతినిధులు

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: స్థానిక ఎస్సీ బాలుర మేనేజ్‌మెంట్ వసతి గృహంలో ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ గురువారం నివాళులర్పించారు. వివిధ ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులంతా ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి అంజలి ఘటించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కె.కామేశ్వరరావు, కె.దాలయ్య, కసవయ్య, బి.చిన్నవాడు, జె.బాబురావు, జె.చంద్రశేఖర్, ఎ.రాహుల్‌కుమార్, టి.సూర్యం తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనపై ఆసక్తి కలిగించాలి

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులకు అభ్యాసనపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు అన్నారు. గురువారం ఆయన జగన్నాథపురం ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పర్యవేక్షించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో అప్పారావు

జోరువాన

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గురువారం మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కుండపోతగా కురిసింది. ఈ వర్షం రైతులకు కొంత ఊరటనిచ్చింది. కాగా కడలి కల్లోలంగా మారడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. అలాగే వదర నీరు బెండిగేటు, పూండిగల్లి, నగరంపల్లి, బెండి, హుకుంపేట రోడ్లపైకి చేరడంతో రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



కుండపోతగా కురుస్తున్న వర్షం

పాఠశాలకు బెంచీల వితరణ



దివాకర్ సాహూ దంపతులు అందిస్తున్న స్టీల్ బెంచీలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజనం పథకానికి అవసరమయ్యే స్టీల్ బెంచీలను పూర్వ విద్యార్థులు దివాకర్ సాహూ దంపతులు గురువారం అందజేశారు. సుమారు రూ.20 వేల విలువైన ఈ బెంచీలను దంపతులు హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్‌కు అందించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


గౌరీ పౌర్ణమి సందర్భంగా గురువారం గ్రామాల్లో ఘనంగా నందెన్న– గౌరమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముత్తైదువులు భక్తిశ్రద్ధలతో గౌరమ్మ పాటలు పాడుతూ నోములు నోచారు. రోజంతా ఉపవాస దీక్ష చేపట్టి, సాయంత్రం తులసి కోట వద్ద చంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: పూజలందుకుంటున్న స్వేచ్ఛావతి అమ్మవారు



సోంపేట: జింకిభద్రలో వ్రతం చేస్తున్న మహిళలు



టెక్కలి రూరల్: గాజులతో లలిత త్రిపుర సుందరి అమ్మవారి అలంకరణ



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో నందెన్నను ఊరేగిస్తున్న మహిళలు



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో గౌరమ్మ ఊరేగింపు



కాశీబుగ్గ: మందస మండలం బాహదాపల్లి గ్రామంలో పగటివేషాలతో గ్రామస్తులు



టెక్కలి: పాత నౌపడలో గౌరీ పౌర్ణమి పూజలు చేస్తున్న మహిళలు



కాశీబుగ్గ: చినబాడంలో నందెన్నను తీసుకొస్తున్న గ్రామస్తులు

కిచెన్ గార్డెన్‌పై అవగాహన

టెక్కలి రూరల్: అంగన్‌వాడీ సిబ్బందికి నూతనంగా ప్రవేశపెట్టిన కిచెన్ గార్డెన్ అనే కార్యక్రమంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ పీవో శోభరాణి అధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగుపరిచేందుకు చర్యలు

సంతబొమ్మాళి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సీతానగరం గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించి కొండ చీపుర్లు తయారీ యూనిట్లను పరిశీలించారు. సభ్యులు తయారు చేస్తున్నటువంటి ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించి సభ్యుల ఆదాయం పెంచేందుకు సెర్ప్ పని చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 50 గ్రామ సంఘాల నుంచి ఈ ఏడాది 50 రకాల ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ అన్‌డీసీలో రిజిస్ట్రేషన్ చేసి, విక్రయాలు జరిపేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీని ద్వారా సంఘ సభ్యుల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్‌హెచ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.